క్లుప్తంగా

పంట నష్టంపై నివేదికలు సిద్ధం



విడవలూరు: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొడవలూరు : తుపాను కారణంగా జరిగిన పంట నష్టాల నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఓ లక్ష్మి తెలిపారు. మండలంలోని బసవాయపాళెం, వెంకన్నపురం, గండవరం గ్రామాల్లో తుపాన్ వల్ల ఏర్పడిన పంట నష్టాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేయనున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వరి విత్తనాలు పొందాలని కోరారు. ఆమె వెంట వీఏఏలు కె.విష్ణుప్రియ, బి.లిఖిత, టి.కవిత, కె.శ్రావ్య ఉన్నారు.

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న వరి, వేరుశనగ పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీలక్ష్మి, కోవూరు ఏడీఏ సుజాత గురువారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఏఓ వెంకట కృష్ణయ్య ఈ సందర్భంగా కోరారు.

ప్రతి రైతుకూ ప్రభుత్వ భరోసా



ఆకుతోట పంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఏఏబీ సభ్యుడు, అధికారులు

కోవూరు : తుపాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఇటీవల తుపాన్ కారణంగా దెబ్బతిన్న ఆకుతోటలు, అరటి సాగు తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడులు పోసి నష్టపోయిన ప్రతి రైతుకు 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు అందజేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలిచ్చారన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలకు సంబంధించి రూ.32 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, అలాగే 60 వేల ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయని, 10 వేల ఎకరాల వరకు నాట్లు వేసిన పొలాలు దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచనా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పంటలకు సంబంధించి సర్వే ప్రక్రియ జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మీరారెడ్డి, వెంకటరమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి విశాల్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్వేతలేఖ ఉన్నారు.

నిరుద్యోగులకు వరం 'విశ్వకర్మ యోజన'



డ్రోన్లతో ఎరువులు, పురుగు మందుల పిచికారీపై అవగాహన

కొడవలూరు : నిరుద్యోగులకు పీఎం విశ్వకర్మ సంకల్ప యోజన పథకం వరం లాంటిదని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 రకాల చేతి వృత్తులపై శిక్షణ ఇవ్వడంతో పాటు చేతి వృత్తులను ఏర్పాటు చేసుకునేందుకు పూచీకత్తు లేని రుణ సాయం అందించడం పథకం లక్ష్యమన్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.500 గౌరవ వేతనం చెల్లించడంతో పాటు శిక్షణ పూర్తయిన వెంటనే పనిముట్ల నిమిత్తం రూ.15 వేలు చెల్లిస్తారని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ.60 లక్షల రుణాల చెక్కులను అందజేశారు. డ్రోన్‌ల ద్వారా ఎరువులు, పురుగు మందులు పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, ఏఓ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.రాజేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, నాయకులు విజయశ్రీ, రాఘవేంద్రరావు, మురళీకృష్ణ, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలివ్వండి



విరాళాన్ని అందజేస్తున్న హరినారాయణన్



ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో..

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలను ఇవ్వాలని కలెక్టర్ హరినారాయణన్ కోరారు. తన వంతు విరాళాన్ని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కోరారు. పతాక నిధికి విరాళాలను సేకరించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాలకు ఎన్‌సీసీ క్యాడెట్లు రానున్నారని, వీరికి విరాళాలను అందజేయాలని కోరారు. 24 ఏ బెటాలియన్ ఎన్‌సీసీ బాలబ్రహ్మచారి, పెంచలప్రసాద్, మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బీజే రెడ్డి, వెంకయ్యనాయుడు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికులు, మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి విరివిగా విరాళాలను ఇవ్వాలని 10 ఆంధ్రా నావల్ ఎన్‌సీసీ యూనిట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు కోరారు. కొండాయపాళెం కూడలి వద్ద గల సైనిక సంక్షేమ కార్యాలయంలో విరాళాలను 10 ఆంధ్రా నావల్ యూనిట్ క్యాడెట్లు సేకరించారు. విరాళాలు అందజేసిన వారికి ఆదాయపన్ను మినహాయింపు ఉంటుందని, వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

15న యునైటెడ్ సింహపురి క్యారల్స్



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): సింహపురి యునైటెడ్ క్యారల్స్‌ను ఈ నెల 15న నిర్వహించనున్నామని సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. యేసుక్రీస్తు జనన సందేశాన్ని వివరించే ప్రత్యేక పాటలతో నగరంలో భారీ ర్యాలీని నిర్వహించనున్నామని తెలిపారు. సుబేదారుపేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి బట్వాడిపాళెం సెంటర్ వరకు ర్యాలీ సాగనుందని వివరించారు. కన్వీనర్ డేవిడ్ దయాసాగర్, కో కన్వీనర్లు బ్రదర్ జానీజో, విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు సిటీ: రంగనాయకులపేటలో నివాసం ఉంటున్న బయ్యా రామయ్య (70) గురువారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఆయన నేత్రాలను సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

సంగీత విభావరి రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఘంటసాల గానలహరి సంగీత విభావరిని శనివారం సాయంత్రం నిర్వహించనున్నామని సహృదయ సేవా సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టనున్నామని చెప్పారు. భారీగా తరలిరావాలని కోరారు.

గిరిజన బాలికల వసతిగృహంలో పరిశీలన



దోమతెరలను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

నెల్లూరు సిటీ: పొదలకూరు రోడ్డులోని గిరిజన బాలికల వసతిగృహాన్ని మలేరియా అధికారి హుస్సేనమ్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హాస్టళ్లలో కిటికీలకు మెష్‌లను బిగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కొన్ని కిటికీలకు రంధ్రాలుండటన్ని గమనించి సరిచేయాలని ఆదేశించారు. దోమలతో వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించామని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : కులగణన సర్వేకు కుల సంఘాలు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో కులగణనకు సంబంధించి వివిధ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సర్వే కోసం వచ్చే బృందానికి ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఏబీ సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, బొంధిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్ సింగ్, డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, మండల ఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓలు రహీమ్, వై.చెంచులక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

బాధితులకు ఆహారం అందజేత



నెల్లూరు సిటీ: శెట్టిగుంటరోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద తుఫాన్ బాధితులకు దుస్తులు, ఆహారం, బ్రెడ్లు, చిన్నారులకు మంకీ క్యాప్స్‌ను హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ సభ్యులు గురువారం అందజేశారు. రమేష్, శివశంకర్, కల్యాణ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో 2024కు సంబంధించిన ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్ రేషనలైజేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫారం, ఆన్‌లైన్లో దరఖాస్తు చేసేందుకు శనివారం వరకే గడువుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చెందిన బాలశంకర్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, టీడీపీ నుంచి హరికృష్ణ, బీజేపీ నుంచి నరేష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన



పొదలకూరు : కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో సహస్ర దీపారాధనను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు దీపాలను వెలిగించి బాబాను దర్శించుకున్నారు. గత 17 ఏళ్లుగా సహస్ర దీపారాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మందిర సేవా సమితి సొసైటీ చైర్మన్ చీమకుర్తి రాజగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి దామోదరం, సభ్యులు లక్కాకుల ఆనందరావు, సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై సమావేశం నేడు

నెల్లూరు(బారకాసు): కులగణన సర్వేపై కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సమావేశాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

80 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ

వెంకటాచలం : తుపాన్ కారణంగా నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు వరి విత్తనాలను వెంకటాచలంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించి ప్రజల, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఎక్కువ మంది రైతులకు సంబంధించి నారుమళ్లు దెబ్బతినడంతో వెంటనే ఆర్బీకేల ద్వారా 80 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసులు, ఏఓ హరి కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపంచాక్షరి సప్తాహం



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో శివపంచాక్షరి సప్తాహం, అఖండ భజనలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు ఆల్తూరు గిరీష్‌రెడ్డి మాట్లాడారు. శివపంచాక్షరి సప్తాహం, అఖండ భజనలను వేదపండితులు, అర్చకుల విశేష పూజలతో ప్రారంభించామని చెప్పారు. దేవస్థానంలో శివదీక్షను గత నెల 14న చేపట్టారని వివరించారు. నగరంలోని రంగనాథస్వామి దేవస్థాన ప్రాంగణం నుంచి 12 కలశాలతో పవిత్ర పినాకినీ జలాలను మూలస్థానేశ్వర స్వామి దేవస్థానానికి ఈ నెల 11న నగరోత్సవంగా తీసుకురానున్నారని పేర్కొన్నారు. కార్తీక మాస ముగింపును పురస్కరించుకొని పవిత్రజలంతో స్వామివారికి అభిషేకాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నామని వెల్లడించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, విజయకుమార్‌రెడ్డి, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మహిళలకు ఆటోల తాళాలను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తదితరులు

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి
- పేద మహిళలకు ఆటోల పంపిణీ

నెల్లూరు (దర్గామిట్ట): మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉన్నతి (ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్) పథకం ద్వారా మహిళా శక్తి పేరుతో పేద మహిళలకు ఆటోలను నగరంలోని డైకస్ రోడ్డులో గల తన క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేసిన అనంతరం మంత్రి మా ట్లా డారు. మహిళల జీవన ప్రమాణాలను పెంచ డమే లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్ర భు త్వం చేపడుతోందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలకు 10 శాతం లబ్ధిదారుని వాటా, 90 శాతం వడ్డీ లేని రుణంతో ఆటోలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 220 ఆటోలను పంపిణీ చేస్తుండగా, జిల్లాలో 10 ఆటోలను అందజేశామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి శిక్షణ పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కలెక్టర్ హరినారాయణన్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డితో కలిసి జెండా ఊపి ఆటోలను మంత్రి ప్రారంభించారు. ఏపీఎంలు రెహనా, సరిత, పెంచలబాబు, శైలజ, నాగమణి, లలిత, సుజీవన తదితరులు పాల్గొన్నారు.

వారి ఓట్లను తొలగించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటు హక్కు కలిగిన వారిని గుర్తించి.. వారి ఓటును తొలగించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, తోటపల్లిగూడూరు మండలాధ్యక్షుడు శంకరయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇలాంటి ఓట్లను తొలగించాలని కోరారు.

పునరుద్ధరణ పనులు వేగవంతం



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు.. కూలిన చెట్లను తొలగించి సౌకర్యాలను పునరుద్ధరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. 24వ డివిజన్ కల్లూరుపల్లి, ఇందిరమ్మ కాలనీల్లో చేపట్టిన పారిశుధ్య పనులను అధికారులతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్లపైకి చేరిన వరద నీటిని తొలగించేందుకు అవసరమైన పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టనున్నామని వెల్లడించారు. అవసరమైన రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో నిలిచిన వరద నీరు కాలువల ద్వారా ప్రవహించేందుకు వీలుగా అవసరమైన ప్రాంతాల్లో యంత్రాల సాయంతో గండ్లు కొట్టించాలని సూచించారు. అనంతరం వేదాయపాళెం, తడికలబజార్, వాకర్స్‌రోడ్డు, బారకాస్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.

'ఆడుదాం.. ఆంధ్రా' రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

'ఆడుదాం.. ఆంధ్రా' టోర్నీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేసి ఎక్కువ సంఖ్యలో క్రీడాకారులు, వీక్షకులు పాల్గొనేలా ప్రోత్సహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లు నిండిన వారిని క్రీడాకారులుగా.. ఎనిమిదేళ్లు దాటిన వారిని వీక్షకులుగా నమోదు చేయాలని సూచించారు. సీఈఓ నాగరాజకుమారి, డీఎస్డీఓ యతిరాజ్, అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకం, రుద్రహోమం, ఆకాశదీపాలంకరణ, ప్రాకారోత్సవం తదితరాలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉభయకర్తలుగా లక్ష్మీనరసయ్య, రమణమ్మ, వెంకటకృష్ణయ్య, ప్రమీల దంపతులు వ్యవహరించారు. ఈఓ ఆరంబాకం వేణుగోపాల్ పర్యవేక్షించారు.

మహాసభ జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న మహిధర్‌బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను విజయవాడలో ఆదివారం నిర్వహించనున్నామని నెల్లూరు జిల్లా అవుట్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్ మహిధర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని రెవెన్యూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. మహాసభకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎంబీబీఎస్ సీటు పేరిట మోసం

- ప్రధాన నిందితుడి కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): తక్కువ ఖర్చుకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలో నివాసం ఉంటున్న అనిత తన కుమారుడికి నీట్‌లో ర్యాంక్ రాకపోవడంతో నిరాశ చెందారు. కుమారుడ్ని ఎలాగైనా డాక్టర్‌ను చేయాలని నిర్ణయించుకున్న ఆమెకు అశ్వినీకుమార్ పరిచయమయ్యారు. తనకు పలువురు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్ తెలుసునని.. తక్కువ ఖర్చుకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని నమ్మబలికారు. అతని మాటలను నమ్మిన అనిత రూ.18 లక్షలను ఇచ్చారు. అప్పటి నుంచి సీటు ఇప్పించకుండా ముఖం చాటేశారు. దీంతో గత నెల్లో బాధితురాలు నిలదీయగా, తన అనుచరులతో దాడి చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితులపై వివిధ సెక్షన్లతో పాటు హత్యాయత్నం కేసును నమోదు చేశారు. కొద్ది రోజుల అనంతరం హత్యాయత్నం చేసిన వారిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.